# గోదారమ్మ-15

"ఇది నా చిన్నపుడు జరిగిన సంగతి...అప్పట్లో మా ఇంట్లో ఒకతను వంట చేసేవాడు..ఒక రోజు ఏవో సరుకులు ఇంట్లోవి దొంగతనం చేస్తూ అమ్మకి పట్టుబడ్డాడు. తప్పించుకునే మార్గం లేక అమ్మ కాళ్ళు పట్టేసుకుని క్షమించమంటూ ప్రాధేయపడ్డాడు.

అమ్మ గట్టిగా మందలించి వూరుకుంది.

నాకు చాలా కోపం వచ్చింది.

అలా ఎందుకు చేసావని అమ్మని నిలదీస్తూ 'పనిలోనుండి అలాంటివాళ్ళని తీసేయాలిగా' అన్నాను.

దానికి మా అమ్మ ఏం చెప్పిందో తెలుసునా...?

"అతను అలాంటి పని చేశాడంటే... దానిలో నా తప్పూ ఉంది. సరిగా చూసుకోకపోవటం నా తప్పు కదా...! 'అవకాశం కుదరటం... అవసరాలు ఉండటం' ఎవరో కొద్దిమందిని తప్పించి చాలామంది మామూలు వాళ్ళని ప్రలోభ పెడతాయి. చాలా కొద్దిమంది మాత్రమే నిజాయితీగా ఉండగలుగుతారు! మహా మహా వాళ్ళే కక్కుర్తిపడి లంచాలు గట్రా ఎందుకు తీసుకుంటారంటావ్...?

నేను మీ నాన్న దగ్గర్నుండి నేర్చుకున్న విషయం ఇది. రాజకీయాల్లో ఉంటూ మీ నాన్న చాలా పదవులే నిర్వహించారా... తన దగ్గర పనిచేసే ఉద్యోగస్తులు ఎవరైనా తప్పు చేస్తే...గట్టిగా దండించటమే గానీ ఎప్పుడూ ఉద్యోగంలోంచి మాత్రం తీసెయ్యలేదు! దానికి 'వీపు మీద కొట్టాలిగానీ, కడుపు మీద కొట్టకూడదనేది' తన సిద్ధాంతమని చెప్పేవారు. అదే నేనూ చేశాను... ఈ తప్పుకి గట్టి దండన సరిపోతుంది గానీ.. కుటుంబానికి శిక్షలా పనిలోనుండి తీసిపేసి వాళ్ళ జీవితాలను రోడ్డున పడేయటం మంచిపని కాదుకదా...!"

అమ్మ మాటలకు నేను విస్తుపోయాను. నిజమే కదా అనిపించింది! ఇంకొకసారి మా నాన్న దగ్గరకు వరసకు తమ్ముడయ్యే దగ్గిర బంధువు ఏదో సాయానికి డబ్బు కావాలంటూ మా ఇంటికి రావటం జరిగింది.

డబ్బు ఇచ్చి నిష్ఠూరం కొని తెచ్చుకున్నట్లవుతుందని పెద్దవాళ్ళు అంటారు కదా, డబ్బు సాయం చేసేముందు ఆ విషయమూ ఆలోచించండని అమ్మ సలహా ఇచ్చింది.

దానికి నాన్నగారు ఏం జవాబు చెప్పారో తెలుసునా?

'మన ఆత్మీయులు అనుకున్నవాళ్ళ అవసరానికి మనమే సాయం చేయకపోతే ఎలా... డబ్బుకోసం బంధుత్వాన్ని దూరం చేసుకునే వాళ్ళు దూరమైతే అవుతారు! దానికి బాధపడనక్కర్లేదు! నిజాయితీగా నిలబడేవాళ్ళు,

మనవాళ్ళని మనకే అర్థమౌతుందిగా....! అన్నారు'. బంధుత్వం పోతోందని డబ్బుకోసం చూసుకోకూడదని నాన్నగారి అభిప్రాయమని నాకు అర్థమైంది. అలా అమ్మా నాన్నగార్లు తమ నడవడి ద్వారానే నాకూ అలాంటి విలువలను నేర్పించారనిపిస్తుంది...! ఇదీ సంగతి...!"

"అవునమ్మా....అలాంటి తల్లిదండ్రుల పెంపకంలో పెరిగారు కాబట్టే... మీరిలాంటి మంచి పనులెన్నో చేయగలుగుతున్నారు...!" అంది సీత.

"ఆ మాట నిజమే కానీ... ఇపుడు మాత్రం... నిన్ను చూసి, నేను చాలా విషయాలు నేర్చుకోగలుగుతున్నానని నా నమ్మకం...!" ఆవిడ అనగానే సీత చాలా వినమ్రంగా కొద్దిగా తలవంచి చెప్పింది.

"ఎవరు ఎవర్ని చూసి ఏం నేర్చుకోగలుగుతున్నామనే విషయాన్ని పక్కన పెట్టేస్తే... మీ రాక వలన నేను మాత్రమే కాదమ్మా... ఈ వూరు వాళ్ళందరూ పుణ్యం చేసుకోబట్టే మీ మార్గదర్శకత్వం లభించింది...!"

ఆవిడ చిరునవ్వుతో సీతని చూసింది.

"అవునుగానీ సీతా... ఈ మాత్రం దానికి సెలవు పెట్టటం ఎందుకూ... ఇక్కడ పనిని నేను చేయగలనుగదా... నువ్వు వాళ్ళింటికి వెళ్ళి చేస్తే సరిపోతుందిగా...?"

"నేను కొంచెం ముందుగా లేస్తే సరిపోతుందమ్మా... ఇక్కడ పనికి మీ రామచంద్ర సాయం ఎలాగూ ఉంటుందికదా... నేనూ హడావుడి పడకుండా కొంచెం ఖాళీగా ఉండొచ్చనీ, ఎలాగూ సెలవులున్నాయి కదాని పెడుతున్నానంతే...!"

ఆ మాటలకు ఆవిడ అంగీకారంగా తలవూపింది.

"సీతా... నీకో విషయం చెబుదామనుకున్నాను. మరిచేపోయాను. వాళ్ళ పిల్లల సమస్యలతో వచ్చిన వాళ్ళకు గోవిందు ఎంత బాగా కౌన్సిలింగ్ చేస్తున్నాడనుకున్నావు...! మొన్న నొకసారి నేను విన్నాలే...!

'ఎవరైనా పిల్లలు ఇద్దరూ ఇష్టపడితే... పెద్దలను ఒప్పించి వాళ్ళ అంగీకారంతో పెళ్ళి చేసుకోవటం ఆనందదాయకంగా ఉంటుంది! అంతేకానీ, ఇష్టం చూపించని అమ్మాయి వెంటబడీ, వేధించీ ప్రేమను సాధించాలనుకోవటం మూర్ఖత్వం! అలాంటి పనుల వలన మనం మన జీవితాన్ని, సమయాన్ని వృధా చేసుకుంటున్నామనే విషయాన్ని తెలుసుకోవాలి! అందుకు ఉదాహరణగా నా జీవితాన్నే చూడండి. అలాంటి తెలివితక్కువ పని చేసి... నా తప్పును తెలుసుకున్నాను... మార్గాన్ని సరిదిద్దుకోగలిగాను. అందువలన ఆ అమ్మాయీ చక్కగా ఉంది... నేనూ సరైన దారిలో పడ్డాను! వాళ్ళూ కేసు పెట్టకుండా మన్నించటం వలన ఇలా జరిగింది! శిక్ష అనుభవించాక పశ్చాత్తాపం పడేకంటే, తప్పు చేయకుండా ఉండటమే ఉత్తమం కదా అనే నేను చెప్పదలుచుకున్నాను...!' అంటూ ఇలా విపులంగా చక్కగా వివరించాడు...!"

“చాలా సంతోషం అమ్మా..'ముల్లును ముల్లుతోనే తీయాలన్న' సామెతలా మీరు భలే గోవిందు చేతే కౌన్సిలింగ్ చేయించడం అనే మీ ఆలోచన అమోఘం అమ్మా..” అంది ఆనందంగా సీత.

"అది నా గొప్పతనం అనటంకన్నా...ఆ అబ్బాయి పశ్చాత్తాపం అనొచ్చు. సీతా...చాలా కొద్దిమంది మాత్రమే చేసిన తప్పును తెలుసుకోవటమే కాకుండా...తమ అనుభవం కొంతమందికన్నా కనువిప్పు కలిగించాలనే ఆలోచనతో ...గోవిందులా ముందుకు వస్తారు...అంతే కదా " అంది గోదారమ్మ.

“అవును కానీ అమ్మా...మీ మాటల ప్రభావం కూడా గోవిందు మీద చాలా వుంది. ఆ అబ్బాయి లో అలాంటి మార్పు రావటానికి మీ ప్రేరణే ముఖ్యం. మీరు మా వూరు రావటం, అందరిలో మార్పు తేవాలని కృషి చేయటం మా వూరు చేసుకున్న అదృష్టం అని చెప్పాలి. అంతేకాదు, మీరు ప్రారంభించిన రక్షణకు ఎంత ఆదరణ లభించిందో చూసాం కదా...అంతే కాదు అమ్మా... వంతెన పనులన్నీ కూడా చక్కగా జరుగుతున్నాయి. మీరు తలపెట్టిన దేనికీ ఆటంకం కలగటం లేదు! మీ హస్తవాసి అటువంటిది...!“ అంది ఆరాధనపూర్వకంగా సీత.

దానికావిడ తల అడ్డంగా వూపుతూ “నాదేముందిలే సీతా... ఈ వూరు వాళ్ళ సంకల్పబలం అలాంటిది. నేనేదో కొంచెం ఎక్కువ విరాళం ఇవ్వగానే అందరూ దానికే ఎంతో ఆనందంగా తలో చేయూ వేసి వంతెన పని చకచక జరిగేట్లు చూస్తున్నారు. పర్మిషను తేవటం, కాగితాలన్నీ కదలటం లాంటి ఆఫీసు పనులన్నీ ఈవూరు యువకులంతా కలిసిరావటం వలన పనులు వేగం పుంజుకుంటున్నాయి. ముఖ్యంగా రామచంద్రం గట్టి పూనిక వల్లే ఇదంతా సాధ్యమౌతోందని నేను అనుకుంటున్నాను.”

సీత మళ్ళీ చిరునవ్వు నవ్వి వూరుకుంది.

* * *

సీతా...సీతా..

సీతా... సీతా...

రామచంద్ర గట్టిగా పిలిచాడు. లోపలకు వచ్చి “ఇక్కడే ఉన్నావా... మరి నేను అంతలా పిలుస్తుంటే... నీకు వినపడనేలేదా...?” ఆశ్చర్యంగా అడిగాడు.

సీత తమాషాగా నవ్వింది.

“వినిపించింది... కానీ.... నా పేరును నువ్వు పిలుస్తుంటే... మళ్ళీ మళ్ళీ వినాలనిపిస్తుంది ! అందుకే... వెంటనే బదులివ్వాలనిపించదు...!”

“నిజంగానా…?” రామచంద్ర సంభ్రమంగా చూశాడు.

“అవును! నువ్వు పిలిస్తేనే అలా అనిపిస్తుందంటే… నీ గొంతులో మహత్తో, మత్తో ఏదో ఉందన్న మాటేగా…!” చూపుడు వేలుతో చెంపను తాకుతూ సందేహాన్ని అభినయించింది.

“ఇంతకీ… ఎందుకు పిలిచినట్లు రామచంద్రా…?”

సీత ప్రశ్నకి అతను తమాషాగా నవ్వాడు.

“పద్మనాభం గారి కోసం… నాలుగురోజులు సెలవు పెట్టావు. ఇపుడు నాకోసం ఓ రోజు పెట్టొచ్చుగా…?” గొంతులో గారం ఒలికించాడు.

“ఎందుకో…?” అంటూ సీత కళ్ళెగురవేసింది.

“ఎందుకేమిటీ… నేనూ ఆఫీసుకు సెలవు పడేస్తాను. ఇద్దరం రోజంతా కబుర్లు చెప్పుకుంటూ కులాసాగా గడిపేద్దాం…!”

“అవునూ…. రోజంతా ఏం చెప్పుకుంటాం…? ఇపుడు పనులు చేసుకుంటూనే సరదాగా కబుర్లు చెప్పుకోవచ్చుగా…?” సీత ఎదురు ప్రశ్న వేసింది.

“అవునవును…! నువ్వు ఇల్లు వూడుస్తుంటే… నేను నీ నడుంను సరదాగా పట్టుకోవచ్చు! నువ్వు వంట చేస్తుంటే… నీ భుజంమీద తలవాల్చి చూడొచ్చు…! కూరలు తరుగుతూంటే…”

“అడ్డంపడి నువ్వూ వేళ్ళు కోసుకోవచ్చును కూడా…!” అతని మాటల మధ్యలో కల్పించుకుంటూ అని, పకపక నవ్వింది సీత.

రామచంద్ర సీతవైపు ఒక క్షణం పారవశ్యంగా చూశాడు.

“ఇలాంటి నవ్వు కోసం… వేళ్ళు కోసుకుంటే మాత్రమేం నష్టం ఉండదు! ప్రాణాలైనా ఇష్టంగా ఇయ్యేయవచ్చనిపిస్తుంది….!” రామచంద్ర సరదాగా అన్నాడు.

“అబ్బా…! ఎంత ఘాటు ప్రేమయో…” అంటూ సీత మళ్ళీ నవ్వింది.

“నిజం సీతా… నా ప్రేమ చాలా ఘాటైనదే! నిన్ను మొదటిసారి చూసినపుడు… నీతో మాట్లాడే భాగ్యం ఎప్పటికైనా కలుగుతుందా అనుకునే నాకు పెద్దమ్మ పుణ్యమా అని నీతో పరిచయం ఏర్పడింది. నీ మంచితనం గురించి నలుగురూ అనుకునే మాటల్ని విన్నపుడూ ఏమనుకున్నానో చెప్పనా…? ఇంత అందమైన, మంచి అమ్మాయికి భగవంతుడు ఇలాంటి అన్యాయం చేయటం ఏమిటీ అని భగవంతుడిపై చాలా కోపం వచ్చింది!”

సీత అతనివైపు ఇష్టంగా చూసింది.

"నాకైతే ఆ భగవంతుడు నాపై చాలా దయ చూపించాడనిపిస్తుంది! నిజం! నన్నీవూరు రప్పించి, నీలాంటి ప్రేమ మూర్తితో జత కలిపాడు కదా...!" అంది సీత అతనివైపు తన్మయత్వంగా చూసి.

"నిజంగానా...?!"

మెరిసేకళ్ళతో రామచంద్ర అడిగాడు సీతని.

"అంటే... నీకా అనుమానం ఎందుకు వచ్చిందో...? నా ప్రవర్తన ఈ భావాన్ని తెలియజేయటం లేదనేకదా అర్థం...?"

సీత నవ్వును కొంచెం బిగబట్టి చూపుల్లో కోపాన్ని చూపిస్తూ కవ్వించింది. అర్థమైన రామచంద్ర గట్టిగా నవ్వాడు.

సీతా జత కలుస్తూ నవ్వింది.

"నిజంగానే సీతా... నా జన్మ ధన్యమైపోయిందనిపిస్తోంది! దూరం నుండి నిన్ను చూడటమే గొప్ప ఇష్టంగా ఉండేది! అలాంటిది నీ సహచర్యం లభించటం అంటే... ఎంత అదృష్టమో అనిపిస్తోంది...!"

"ఈసారి 'నిజంగానా...' అనే ప్రశ్న నేనడగాలి! అయినా అంత ప్రత్యేకత ఏముందబ్బా నాలో...?"

"అలా అడుగు... రోజుల తరబడి నీ గురించి వర్ణించగలను నేను!..." అంటూ ఏదో చెప్పబోతోంటే "వద్దొద్దు... ఇప్పటికే పనులు మానేసి మనం కులాసా కబుర్లలో పడ్డాం! ఇక ముగింపు పలికి చకచకా పనులు మొదలుపెడదాం! అమ్మ దగ్గిర పిల్లలు ఏం గొడవ చేస్తున్నారో చూసి వస్తాను...!" అంటూ మురిపాన్ని దాచుకుని సీత గోదారమ్మ దగ్గరకు వచ్చింది.

నవ్వు మొహంతో వచ్చిన సీతను చూస్తూ ఆవిడ ఆప్యాయంగా చేయి పట్టుకుని పక్కన కూర్చోబెట్టుకుంది.

"సీతా... ఇపుడు నిన్ను చూస్తుంటే... నాకేమనిపిస్తుందో చెప్పనా...! నువ్వు నీ గురించి చెప్పినపుడు... ఈ ఊరు వచ్చేముందు నువ్వెంత హుషారుగా ఉండేదానివో ఇపుడూ అలా ఉంటున్నావనిపిస్తోంది! నిజమే కదూ?

నవ్వులు రువ్వే చిలిపిదనం... తూనీగలా తుళ్ళిపడే చలాకీతనం నీలో కనుపిస్తున్నాయి! మనసెరిగి మసలుకునే వ్యక్తి జీవిత భాగస్వామిగా లభిస్తే... ఆ ఆనందానికి ఏదీ సాటికాదు! బతుకు బండి పరుగులు పెడుతున్నట్లుగా సాగిపోతుంది మరి! మన బాధ్యతల బరువును పంచుకునే తోడు ఉండటమే కారణం! అవునుకదూ!"

సీత కొంచెం సిగ్గుగా తలవాల్చుకుని చిరునవ్వు నవ్వింది.. "అక్క మరణంతో నాలోని హుషారంతా ఆవిరైపోయినట్లుగా ఉండేది! ఇపుడు మళ్ళీ జీవితం కొత్త చివుళ్ళు వేసినట్లుగా ఉందమ్మా...!" మెల్లగా గొనిగినట్లుగా సీత అంది.

గోదారమ్మ చిన్నగా నవ్వింది.

‘‘అమ్మా... మీకో విషయం చెప్పాలి...’’ అంది సీత గోదారమ్మతో.

‘‘ఏమిటో...?’’ అంటూ ఆవిడ ఆసక్తిగా చూసింది.

‘‘అదేనమ్మా... ఈ మధ్య పద్మనాభంగారింటికి పనుల్లో సాయంగా వెళ్ళానా... అపుడు ఆయన నాతో ఒకసారి ఏమన్నారో చెప్పనా...! మా పెళ్ళికి ముందు రామచంద్రతో ఆయన నా గురించి చెప్పారట. ‘ఆ అమ్మాయి ఎక్కడినుండో వచ్చిందిక్కడకు, ఉద్యోగానికంటూ... ఆ అమ్మాయి గురించి మనకేమీ తెలియదు. వాళ్ళ ఊరిలో తన అందచందాలతో ఎంతమందితో గ్రంథం నడిపిందో ఎవరికి తెలుసు ? నా ఉద్దేశ్యం ప్రకారం అయితే తన పనులకు అడ్డం లేకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ఆ అమాయక మొగుడికి మందో మాకో పెట్టి అడ్డు తొలగించుకుని స్వంతవూళ్ళో అయితే భాగోతాలు బాగా జరగవని భావించి ఇక్కడకు పిల్లాడితో చేరివుంటుంది! అటువంటి పిల్లను కట్టుకుని నువ్వేం బావుకుంటావ్...? మంచి సాంప్రదాయంగల సంబంధం చూసే బాధ్యత నాది. నువ్వు తొందరపడకు’ అంటూ పెళ్ళిని చెడగొట్టాలనే ఉద్దేశ్యంతో రామచంద్రకు నూరిపోశారట....అప్పుడు రామచంద్ర ఏమని అన్నాడో చెప్పనా అమ్మా...?"